# వృధా ప్రయాస

శ్రీ ఎస్. ఆర్. రావు.

అమ్మా: ఆకలే!

పాలిపోయిన మొహముతో పసిబిడ్డడు మెల్లగా అన్నాడు.

కన్నీరు మున్నీరుగా కార్చింది ఆతల్లి తన దౌర్భాగ్యస్థితికి.

ఒకనాడు ఆమెకూడా సుఖాలనుభవించింది. పిల్లాడి పెదవులనుండి ఆకలనే పదము వెలువడనిరోజులు చాలవున్నయి. మొదటినుండి కష్టాలలో కాపురముచేస్తే అంత కఠినమనిపించదు గాని, కొన్నాళ్లు గొప్పగా జీవించి ఒకేదఫాలో కష్టజీవితములో కాలము గడపుట అసాధ్యము.

మాసినగడ్డముతో, బక్కచిక్కిన శల్యావతారములో కుప్పస్వామి ప్రవేశించాడు.

'నా—న్నా: ఆకలి'

'పిల్లాడికి పాలియ్యి' అనే అర్ధములో భార్యప్రక్కచూశాడు.

పసిగుడ్డుని వొళ్ళోకి తీసుకొంది. పంపులేని పుడ్పాలుబ్లేడరు వంటి ఆమెగుండె పిల్లాడి క్షుద్బాధ దీర్చలేకపోయింది.

కుప్పా ఆలోచిస్తూకూర్చున్నాడు తన కాందిశీకులజాతి పడుతున్న యిడుముల గురించి.

భోగభాగ్యాలు తామరాకుమీది నీటిబొట్లని ఆలాపిస్తూ దరిద్ర జీవితము యిష్టముగా గడపేవారిని అతడు ద్వేషించేవాడు ఒకప్పుడు. జీవితము సుఖపడటానికిగాని సన్యసించటానిక్కాదని వాదించేవాడు.

కాని ప్రస్తుతములో అతడు దరిద్రుడయాడు. పూర్వసిద్ధాంతాలని అమలులో పెట్టదల్చుకొన్నా పెట్టలేదు—

చిన్నతనములో గళగ్రాంహిగా చదివిన అసంఖ్యాకమయిన పుస్తకాలలోని సారము నెమరువేసుకొంటున్నాడు. సుఖజీవనము కోసము చక్కటి మార్గాలేమయినా కనుపడుతవేమోనని.

" Lead a luxuriant life by being a midway robber but never lead a life of poverty " అన్న 'అలెగ్జాండరుపోపు' కవి పదాలు జ్ఞాపకానికొచ్చినయి.

అవి ఆచరణలో పెట్టడము తప్ప వేతేగత్యంతరములేదు ధనసంపాదనకి. అటువంటి ఘోరకృత్యము జేయడానికి మనసు వెనుదీసింది.

దైన్యముగా ప్రార్థిస్తే దమ్మిడీ దానముచేసిన పుణ్యాన బోడు ఎవడయినా; కాని దబాయిస్తే ప్రతివాడూ దాసుడవుతాడు. కలికాలం!

దొంగతనం చేయటానికి కుప్పా నిశ్చయించుకున్నాడు. పిల్లాడు యేడ్పు అతని అభిప్రాయాన్ని దృఢపర్చింది.

* * *

రాత్రి పదవుతుంది. కుప్పా చిమ్మచీకటిలో రోడ్డంతా తిరుగుతున్నాడు. కీచురాయి శబ్దాలు, గుడ్లగూబల వికృత ఘోష భీతి గొల్పుతూ రాత్రిని యేలుతున్నాయి.

దూరాన్నుండి బ్యాటరీలైటు ఫోకసు మెఱపులా మెఱసింది. చెట్లచాటున చీకటిలో మాయమయ్యాడు కుప్పా.

ఓ సూటుబూటువాలా టకటకమని చప్పుడు చేస్తూ పోతున్నాడు ఆరోడ్డునుండే.

పిల్లిలాగ అతని వెంటబడ్డాడు. పులిలాగ అతనిమీద లఘించాడు. పశుబలాన్ని ప్రయోగించి, పర్సుపట్టుకొని, పలాయన మంత్ర పఠించాడు.

నిద్రతో కడుపునింపుకొంటున్న భార్యాపుత్రులని లేపి మరో ఊరు పట్టుకుపోయాడు వాళ్ళని.

కోడి కూసింది. 'అమ్మా: ఆకలి' అని ప్రతిధ్వనించింది ఓ కుటుంబ పరిసర ప్రాంతములో.

ఉదయము పది కానిచ్చి, పర్సులోని సరికొత్త పదిరూపాయల కాగితం మార్చడానికి బ్యాంకుకు పోయాడు.

కౌంటరు దగ్గరనున్న ఎకౌంటంటుకి కుప్పా అవతారము సందేహాలు రగుల్కొల్పింది.

"నీవీ నోటెక్కడ సంపాయించావు?"

"మా బుగతోళ్ళు యిచ్చారు"

మీ బుగత యెవరు?"

"మీకెందుకు అధిక ప్రసంగం. చిల్లర దయచేయండి!

ఎకౌంటంటు పీడ తప్పించుకొందామని నోటికొచ్చిన పేరు కూశాడు. దురదృష్టవశాత్తు ఆ పేరుగల పెద్దవారా కొత్త ఊరులో లేకపోయారు.

బ్యాంకుకు కాపలా యిచ్చే గుర్కావాలా యమకింకరుడిలాగ ప్రత్యక్షమయాడు పోలీసులతో.

కుప్పా కట్టెలాగయి పోయాడు. అతని పెదవులంటుకుపోయినయి.

పర్సుతోపాటు డ్రస్సుకూడా దొంగిలించివుంటే తనకీగతి పట్టేది కాదు కదా అని విచారించాడు.

పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరులాగయినందుకు కన్నీరు కార్చాడు.

"నాన్న యింకా రాడేమి" అని ఒక పిల్లాడు వాళ్ళమ్మని ప్రశ్నించాడు ఆశాదృక్కులతో—

మాతృక :
యస్. హెచ్. మన్‌టో

# పువ్వుల విప్లవం

అనువాదం :
శ్రీ జి. కోటయ్య

తోటలోవున్న పువ్వులన్నీ తిరుగబాటుచేసేయి. ఈ విప్లవాగ్ని మొదటినుండీ గులాబీహృదయంలో కుములుతూవుంది. విప్లవోద్రేకంతో దాని నాళాల్లో వేడిరక్తం జివ్వుమంటూ ప్రవహిస్తోంది. ఒకరోజు రాత్రి కంటకాలంకృతమైన తనమెడను పైకెత్తి తోటలోవున్న యితర పువ్వుల్ని చూచి,

"తమ తమ స్వల్పభోగాలకొరకు తాత్కాలికానందంకొరకు యితరులెవ్వరు మనల్ని వుపయోగించుకోడానికి హక్కులేదు—మన సౌందర్యం మనకొరకేగాని దాన్ని యితరులకు పంచియివ్వడం మనం ఏమాత్రం సహించలేము"

అని తీవ్రంగా మాట్లాడింది. కోపంతో ముఖమంతా ఎర్రనై ప్రతిరేకు వుద్రేకంతో వణికిపోయింది.

ఈ గడిబిడకు నిద్రపోతూన్న మల్లెపూలు వులిక్కిపడిలేచి ఒకదానిముఖం ఒకటి చూచుకున్నాయి.

క్రమక్రమేణా గులాబీకంఠం పెద్దదౌతూంది. "సృష్టిలో ప్రతివారూ తమ తమ ఆస్తుల్ని, వారసత్వాన్ని కాపాడుకోడానికి హక్కుంది. పువ్వులమైనమనకుకూడా యీహక్కు వర్తిస్తుంది. ఈ హక్కునుండి మనం ప్రత్యేకింపబడటానికి వీలులేదు. మనం బహు సున్నితమైనవాళ్ళం. మన శరీరాలు మిక్కిలి కోమలమైనవి. చిన్న వేడిగాడ్పు తగిల్తేచాలు మన సౌందర్యం—పరిమళం అన్నీ కూడా మట్టిపాలౌతాయి. మన దాహాన్ని తీర్చడానికి ఒక చిన్న మంచుబిందువు సరిపోతుంది. ఇంతకోమలమైనవాళ్ళం—అపరిశుభ్రమైన గుడ్డికంటి తోటమాలి కఠినకరాల్ని మనం భరించలేము. ఓ కామ్రేడ్స్! ఏ వాతావరణానికి ఎటువంటి పరిస్థితులలోనైనా మార్పుజెందని ఆ తోటమాలి చేతుల్ని మనం సహించగలమా? అని అడుగుతూవున్నాను"

"భరించలేం—భరించలేం—" అని నైట్‌క్వీన్ అరచింది.

రక్తారుణమైన నేత్రాల్తో మండిపోతూన్న చంద్రకాంత వుద్రేకంతో "నేనీ క్రూరుడైన తోటమాలిచేతుల్లో చాలాబాధలు పడ్డాను. నా శరీరం నిండా వున్న రక్తపుమచ్చలే దీనికి నిదర్శనం. ఈ క్రూరునికి వ్యతిరేకంగా విప్లవపతాకం ఎగరేసేవాళ్ళలో నేనే మొదటి వ్యక్తిగా వుంటాను" అని చెప్పింది. దాని శరీరమంతా కోపంతో వణికిపోయింది.

ఈ గొడవంతా ఏమిటో మల్లెపూలకేమీ అర్థం కావడంలేదు. అందులో ఒకటి గులాబీకి దగ్గరగా వొంగి "నీవు నా నిద్రంతా చెడగొట్టావు—ఏమిటి యీ కేకలు?—యిందరా గొడవ" అని వగలాడిమాదిరిగా అడిగింది.

గులాబీకి కొంచెం దూరంగావున్న నందివర్ధన గులాబీ యిచ్చిన ఘాటైన వుపన్యాసాన్నిగురించి ఆలోచిస్తూ చిన్నదగ్గువగ్గి,

"కామ్రేడ్స్!—చిన్నచిన్న జలబిందువులన్నీ కలసి పెద్ద నదిగా ప్రవహిస్తాయి—అట్లాగే మనం పువ్వులమైనప్పటికీ అంతా ఏకంఐతే మన గర్భశత్రువైన తోటమాలిని ఎందుకు పరిమార్చలేము? ఆహ్లాదకరమైన పరిమళాన్ని వెదజల్లే మనం తలచినట్లయితే విషవాయువుల్నికూడా విడిచిపెట్టగలం. కామ్రేడ్స్ గులాబీని ప్రోత్సహించి మన విజయం కొరకు ముందుకు పదండి."

అని చెప్పి తోటలోవున్న ప్రతిపువ్వువైపు సోదరభావంతో చూసింది.

గులాబీ ఏదో చెప్పడానికి సిద్ధమయ్యేప్పుడు యుక్తినేర్చిన మల్లెపువ్వు అతనివైపు తిరిగి వయ్యారంగా "గులాబీ—నీవొక కవివోయ్—నీనోటినుండి యీ అనవసర ప్రస్తావనవింటూంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది. రావోయ్ రా—నాకోసం ఏవీ రెండుపాటలు పాడు, ఈరాత్రికి నేను నీవొళ్ళో నిద్రపోవాలనుకుంటున్నాను. ప్రియా—యీ వసంతఋతువు ఎంత ఆనందంగావుంది! రావోయ్ యీ క్షుద్రప్రపంచాన్ని విడిచి ఎక్కడైతే ఎప్పుడూ సుఖంగా నిద్రపోవచ్చో ఆ ప్రపంచంలోకి పోదాం రా"

వొళ్ళు పులకరించే మధురభావాలు గులాబీ హృదయంలో రేకెత్తేయి. నాడి తీవ్రంగా కొట్టుకుంటూవుంది. క్రమక్రమేణా అంతులేని ఆవులింతలలో మునిగిపోతూన్నట్లు తెలుసుకున్నాడు. మల్లెమధుర వాక్కులవల్ల గలిగినశక్తిని వ్యతిరేకించాలని చూచి

దిగ్గరగా మనసు కెక్కేలా "లేదు—లేదు—యీ క్రూరుణ్ణి హత మార్చాలని శపథం పట్టాను—ప్రేమ—ప్రణయం సౌందర్యం—అని కలలు కనడం అర్ధంలేని పని. యివి నాకేమీ నచ్చవు" అన్నాడు గులాబీ.

మల్లెపువ్వు ఎంతో అలసిపోయినట్లుగా అతని వైపుచూచి "ఏమోయ్ గులాబీ—యిటువంటి మాటలు మాట్లాడకోయ్—నాకు పిచ్చెత్తిపోతూంది. ఏదీ ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో—యీ విశ్వమంతా వెన్నెలతో వెలిగే రాత్రులందు నేను బట్టలు విప్పి నగ్నంగా మంచులో స్నానం చేసేప్పుడు నీవు నన్ను కనిపెట్టే సమయంలో లజ్జారుణమైన నీ చెక్కిళ్ళను చూసి మురిసిపోయే దాన్ని. తడి ఆరని నాపెదవుల్ని అప్పుడు ఎంత వుద్రేకంతో ముద్దు పెట్టుకొనేవాడవు—కదూ? రావోయ్—యీ అనవసర ప్రసంగ మంతా నీకెందుకు—రా. నాతలను నీవిశాల వక్షస్థలంమీద పెట్టుకొని నిద్రపోవాలనుంది ॥

కోమలమైన మల్లెకన్నె తన మృదుకపోలాల్ని గులాబీ కుమారుని లజ్జారుణ చెక్కిళ్ళపై జేర్చి నిద్రపోయింది. దాంతో గులాబీ కుమారుడు తన్మయత్వం పొంది పోయాడు.

కొంతసేపటివరకూ తోటలోవున్న పువ్వులు నాల్గువైపుల నుండి గులాబీని పిలవడం వినిపించింది. కాని అతను మాత్రం లేవలేదు. తెల్లవార్లూ ప్రియురాలి కౌగిట్లోనే మైమరచి నిద్ర పోయాడు.

ఉదయాన్నే రావడంతోటే గుడ్డికంటి తోటమాలి మల్లె గులాబీ పువ్వులు ఒకదాని ప్రక్కన ఒకటి నిద్రపోతూవుండడం చూసి ఎప్పుడు ఎటువంటి పరిస్థితులలోనైనా—ఎటువంటి వాతావరణానికైనా మార్పుజెందని అతని కఠినమైన చేతుల్తో, ఒకదాని కొకటి పెనవైచుకొని నిద్రపోతూన్న—పువ్వుల కాడల్ని తుంచి పారేశాడు.


# చిత్రగుప్త

మాసానికి రెండుమారులు వెలువడే జాతీయ హాస్యరస పత్రిక.

ఆంధ్రుల అభిమానమును చూరగొనిన చిత్రగుప్త దిగ్విజయంగా సాగుతూవుంది.

మీరంతా వెంటనే చందాదారులు కాగోరెదము.

| | | |
|---|---|---|
| విడిసంచిక వెల | | 0—3—0 |
| సంవత్సర చందా | రు. | 4—8—0 |
| 6 మాసముల చందా | రు. | 2—4—0 |

చిత్రగుప్త కార్యాలయం. సౌకార్పేట, మద్రాస్.